



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 276 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 25-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

- పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి
- ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు




**న్యూఢిల్లీ,-జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శింనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది.

-మిగతా2 లో

## దిగొచ్చిన ట్రంప్

- ఇండియాపై 25 శాతం సుంకాలు తగ్గించనున్న అమెరికా..?
- రష్యా చమురు దిగుమతిని ఇండియా తగ్గించింది
- అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బీసెంట్



**న్యూఢిల్లీ,-** భారత్ ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఈ సుంకాల్ని అమెరికా తగ్గించే యోచనలో ఉంది. దీనికి కారణం.. రష్యా నుంచి ఇటీవల చమురు కొనుగోళ్లను ఇండియా తగ్గించడమే. రష్యా నుంచి చమురు దిగుమతుల్ని ఇండియా తగ్గించిన నేపథ్యంలో టారిఫ్ లు 25 శాతం నుంచి 50 శాతం వరకు తగ్గించే ఆలోచన ఉందని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ అన్నారు.ఈ అంశాన్ని ట్రంప్ నాయకత్వం పరిశీలిస్తోందన్నారు. అమెరికాలోని ఒక మీడియా సంస్థతో స్కాట్ మాట్లాడారు. ఆయిల్ దిగుమతుల్ని ఇండియా తగ్గించుకోవడం హర్షించదగిన చర్య అన్నారు. భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతోనే ట్రంప్ మనపై టారిఫ్ లు పెంచాడు. అలాగే, రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య వ్యత్యాసాల కారణంగా కూడా టారిఫ్ లు పెంచాడు. రష్యా ఆయిల్ కొనడం ఇండియా తగ్గిస్తేనే టారిఫ్లు తగ్గిస్తామని ట్రంప్ హెచ్చరించాడు. అయితే, వివిధ కారణాల వల్ల ఇటీవల ఇండియా రష్యా నుంచి చమురు కొనుగోలును స్వల్పంగా తగ్గించింది. దీంతో తమ ఒత్తిడి ఫలించిందని,

-మిగతా 2 లో



# సింగరేణిపై.. విష ప్రచారం

### తెలంగాణ ఆస్తులపై గద్దల చూపు

- సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారు
- ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి?
- తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం
- ఒకరు కథనం..మరోకరు లేఖ...ఇంకొకరు విచారణ
- వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి
- తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదు
- బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం

**హైదరాబాద్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి'

-మిగతా2 లో

## తెలంగాణ జాగృతి సింహ గర్జన

- స్థానిక ఎన్నికల బరిలో దిగేలా మాస్టర్ ప్లాన్
- ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తు పై పోటీ




**హైదరాబాద్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాజకీయంగా బలపడడానికి అసవరమైన రీతిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇందుకు అవసరమైన విధంగా పునాదులు వేయాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిలబడాలన్న దిశగా వ్యూహం వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి నేతలు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మున్సిపాలిటీలతోపాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనూ సింహం గుర్తుతో పోటీ

-మిగతా2 లో


## అమెరికాను కుదిపేస్తున్న మంచు తుఫాన్

- ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు
- 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి



**వాషింగ్టన్, -జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమెరికాను భారీ మంచు తుపానుతాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో( భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

-మిగతా2 లో



## టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే

- అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు
- సిఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

**హైదరాబాద్,- జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక,

-మిగతా2 లో

## స్టార్టప్ కేంద్రంగా టీ హబ్

### ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తూరన్న వార్తలపై స్పందించిన సీఎం

- ఇతర కార్యాలయాలు అక్కడ వద్దన్నా రేవంత్
- అమెరికా పర్యటన నుంచి సిఎస్ కు ఫోన్ చేసి సూచనలు



**హైదరాబాద్ జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

-మిగతా2 లో



## సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు

- కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత హననం జరుగుతోందని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెటిఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ కుటుంబం అలీబాబా 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్రవిమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ స్టువర్ట్ పురం దొంగల బ్యాచా మారిందన్నారు. ఆరనీకుమా ఈకార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం ఆరిపో కుండా చూసుకోవాలని సెటైర్లువేశారు. ఫోన్ ట్యాపింగ్పై కెటిఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యా స్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలాతీవ్రమైనదని,

-మిగతా 2 లో

# సింగరేణిపై.. విష ప్రచారం

మొదటి తరువాయి



అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్‌ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేడని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూ లు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మంది నీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

## గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

మొదటి తరువాయి



ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. ఎముకలు కొరికే చలిలో దాదాపు 15 రోజులుగా కర్తవ్యపథ్ పై ప్రాక్టీస్ చేస్తున్నారు. సుమారు వంద మంది కళాకారులు దేశంలోని వివిధ కళారూపాలతో కలిపి, ఏక్ భారత్ అనే కాన్సెప్ట్ తో కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్ కంటింజెట్లకు ఏమాత్రం తీసిపోకుండా, కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఈసారి కవాతు చేయబోతున్నారు. ఎపి, తెలంగాణ నుంచి మొత్తం 133 మంది పాల్గొంటున్నారు. ఈ టీంను కవాడీ గూడకు చెందిన బీటెక్ మూడో ఏడాది విద్యార్థి భరత్ లీడ్ చేయబోతున్నాడు. డిసెంబర్ 27 న ఢిల్లీ వచ్చిన ఈ టీం దాదాపు నెల రోజులుగా కర్తవ్య పథ్ పై కవాతు చేస్తోంది. భారత గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా భారతీయ సినిమా అపూర్వమైన రీతిలో జాతీయ దృష్టిని ఆకర్షించనుంది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజరు లీలా భన్సాలీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కోసం సినీ శకటాన్ని రూపొందించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఈ ప్రత్యేక సినీ శకటానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం. 'భారత్ గాథ' అనే భావనతో తీసుకువస్తున్న ఈ శకటానికి కొత్తగా స్వరపరిచిన, ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ ఆలపించిన పాట తోడవుతుంది. జీవన సాంస్కృతిక కథనంగా సినిమా పట్ల భన్సాలీ దార్శనికతకు ఇదొక తార్కాణంగా నిలుస్తుంది.

## దిగొచ్చిన ట్రంప్

మొదటి తరువాయి



టారిఫ్ ల పెంపు మంత్రం పనిచేసిందని అమెరికా అంటోంది. టారిఫ్లు ప్రస్తుతం అమలవుతున్నాయని, కానీ, వాటిని తగ్గించేందుకు మార్గం దొరికిందని స్కాట్ అన్నారు. మరోవైపు యూరోపియన్ యూనియన్ (ఈయూ) మాత్రం ఇండియాపై టారిఫ్లు విధించకపోవడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ఇండియాతో భారీ ట్రేడ్ డీల్ కుదుర్చుకునేందుకు ఈయూ ప్రయత్నించడం వల్లే టారిఫ్లు లేవని స్కాట్ అన్నారు.

## తెలంగాణ జాగృతి సింహ గర్జన

మొదటి తరువాయి



చేయాలని తెలంగాణ జాగృతి నాయకత్వం నిర్ణయించింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సంప్రదింపులు పూర్తి చేసిన తెలంగాణ జాగృతి నాయకత్వం.. ఆ పార్టీకి చెందిన సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశంపై ఏఐఎఫ్‌బీ పార్టీ, తెలంగాణ జాగృతి మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పటికే రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం పెంచారు. అయితే, పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా. ఈలోపు రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలతోపాటు జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లోనూ ఏఐఎఫ్‌బీ సింహం గుర్తుతో బరిలోకి దిగాలని జాగృతి నాయకత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ జాగృతి నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె వల్ల ప్రధానంగా నష్టపోయేది బిఆర్ఎస్ పార్టీయే. ఇది కాంగ్రెస్‌కు లాభించగలదు. అలాగే బిజెపికి కొంత దెబ్బతినగలదని అంటున్నారు.

## టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే

మొదటి తరువాయి

విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు


మొదటి తరువాయి



దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు. కాళేశ్వరం అవినీతి పై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బిజెపి నేతలపై ఉన్న ఇడి కేసులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగు తుందని, అలాంటప్పుడు సినిమావాళ్లఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.

## అమెరికాను కుదిపేస్తున్న మంచు తుఫాన్

మొదటి తరువాయి



శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. మున్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయిాలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## స్టార్ట్ అప్ కేంద్రంగా టీ హబ్

మొదటి తరువాయి



ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

# నేటి యువతకు ఆదర్శమవుతున్న డా.శివ ముదిరాజ్



సామాజికసేవే లక్ష్యంగా చేసుకొని రాజ్యాంగాన్ని అనుసరిస్తూ సామాజికన్యాయం కోసం ఉద్యమపంథాను ఎన్నుకోని తనదైనశైలిలో అహర్నిశలు పాటుపడుతున్న మేధావిగా పేరుగాంచిన డా.వై శివ ముదిరాజ్ నేటి యువతకు మార్గదర్శంగా నిలుస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. సమాజాన్ని తన కుటుంబంగా మార్చుకున్న ఇతను పేద,బడుగు,బలహీన వర్గాలను కుటుంబసభ్యులుగా భావించి,వారికీ రాజ్యాంగపరంగా దక్కాల్సిన సామాజికన్యాయం, హక్కులు, సమానత్వం,అభివృద్ధియే లక్ష్యంగా శపథం పూనుకొని,తనజాతిని బానిసత్వం నుంచి పూర్తిగా విముక్తిచేయడమే సంకల్పంగా భావిస్తూ ,పేదరికం, ఆకలి,అన్యాయాల గొలుసులను తెంచడంకోసం తన పోరాటం కొనసాగిస్తూ, రాష్ట్ర పునఃనిర్మాణంలో నా జాతిని భాగస్వామ్యులను చేయడమే జీవితలక్ష్యంగా చేసుకోని భిన్నరుపాలలో తన పోరాటపంథాను కొనసాగిస్తూ,ముందుగా అతని ముదిరాజ్ సామాజికవర్గాన్ని చైతన్యపరుస్తూనే బీసీ సబ్బండ జాతులకోసం తన నాయకత్వంలో ప్రత్యేకశైలితో పోరాటపఠిమను చూపడం ఆయనకే చెల్లిందని చెప్పవచ్చు.

ఉమ్మడి పాలమూరుజిల్లా ప్రస్తుత వనపర్తి జిల్లాలోని గణపురం మండలానికి చెందిన ఒక మారుమూలగ్రామంలో వ్యవసాయదార కుటుంబానికిచెందిన శివ విద్యార్థిదశ నుండియే పోరాటాలపట్ల ఆకర్షితుడై నాయకత్వలక్షణాలను అలవర్చుకుని ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ,తర్వాత హైదరాబాద్ లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేరి ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ,విద్యార్థినాయకుడుగా తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో క్రియాశీలకపాత్ర పోషించాడు.ఆల్ ఇండియా ఓబిసి విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతూ సమస్యల పరిష్కారమార్గాలకోసం పోరాటాలు చేస్తూ,పలు సామాజిక ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడం జరుగుతుంది.

**ముదిరాజ్ జాతినిర్మాణంలో తనపాత్ర :**

2009లో అప్పటి ముఖ్యమంత్రి డా.వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజుల పోరాటాల ఫలితంగా, వారికి విద్య,ఉద్యోగాలలో తీవ్రనష్టం వాటిల్లుతున్నదని 15 జీవోను తెస్తూ ముదిరాజులను బిసి-డి నుండి బీసీ-ఏలోకి చేర్చితే న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో కోర్టులచుట్టూ తిరిగి చివరికి బీసీ కమిషన్ వద్దకు చేరింది.ఇన్ని సంవత్సరాల నుండి విద్యా,ఉద్యోగ,రాజకీయ,సామాజికరంగాలలో ఎదుర్కొంటున్న అన్యాయాలను వెలుగులోకి తెచ్చేందుకు "ముదిరాజ్ ప్రజా చైతన్య బస్సు యాత్ర" చేపట్టడం,చెరువుల ఆక్రమణ,చేపల పెంపకంలో అన్యాయం,ముదిరాజుల గ్రామ బహిష్కరణలపై స్పందిస్తూ పోరాటాలు గావించడం,కొర్వి కృష్ణస్వామి, నెల్లీ లక్ష్మీనారాయణ,డా.బాలకిష్టయ్య,కామ్రేడ్ కేవల్ కిషన్,ఎర్ర సత్యం,తెలంగాణ మలిదశఉద్యమ తొలిఅమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజులాంటి మహనీయులను ఎప్పటికప్పుడు స్మరించుకుంటూ వారిచరిత్రను ప్రజలకు తెలిసేవిదంగా కార్యక్రమాలు చేస్తూ,ప్రభుత్వం దృష్టికి తేవడం,అందులో భాగంగానే తెలంగాణ బందూక్,ప్రజావీరుడు పండుగ సాయన్న వర్ధంతిసందర్భంగా పాలమూరు యూనివర్సిటీ వేదికగా ఏర్పాటుచేసిన "రన్ ఫర్ సెల్ఫ్ రెస్పెక్ట్" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం,మేధావులచే సెమినార్,చర్చ కార్యక్రమాలు చేపట్టి పుస్తకాలు తేవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

**బీసీ ఉద్యమాలలో తనపాత్ర :**

రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ,సమానత్వం,సామాజిక న్యాయం జరగాలని హామీ ఇస్తుందని,అయితే దేశంలో అత్యధిక జనాభాకలిగి,దేశ సంపదసృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్న బీసీ (ఇతర వెనుకబడిన వర్గాలు)లకు ఈ రాజ్యాంగ హామీలు ఎందుకు అమలుకు నోచుకోలేకపోతున్నాయని ప్రశ్నిస్తూనే పలు కార్యక్రమాలు చేపట్టడం,బీసీల రిజర్వేషన్ గురించి పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం రాత్రికిరాత్రియే ఎవ్వరు అడగకున్న ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్స్ తేవడంతో దానిని వ్యతిరేఖిస్తూ వివిధ దినపత్రికలకు వ్యాసాలు లిఖించడం,పలు టెలివిజన్ నిర్వహించే చర్చకార్యక్రమాలలో పాల్గొని తన విశ్లేషణాత్మకమైన సందేశాన్ని ఇవ్వడం,కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా,ఉద్యోగ,స్థానికసంస్థల్లో అమలుచేస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఎన్నికలకు ముందు ఘనంగా ప్రకటించిన హామీని ఇప్పటివరకు అధికారికంగా కార్యరూపం దాల్చలేదని నిరసనకార్యక్రమాలు చేస్తూనే,ఓటుయొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ "మనఓటు మనకే వేసుకుని- మనల్ని మనమే పాలించుకోవాలని" పలు కార్యక్రమాలు నిర్వహించి సామాజికమాధ్యమాల ద్వారా అందరికీ తెలిసేవిధంగా విస్తరిస్తూ నూతనఒరవడికి నాందిపలుకుతున్నారు.బీసీల రాజ్యాధికారంలో భాగంగా "మేమంతో-మాకంత" అంటూ పలు ఉద్యమాలకు శ్రీకారంచుట్టి ప్రజల్లో చైతన్యజ్వాలలు రగిలుస్తున్నారు.కుల జనగణన చేస్తే జనాభా ప్రాతిపదికన వివిధ బీసీకులాలకు స్థానికసంస్థలలో రిజర్వేషన్ దక్కి రాజ్యాధికారంలో అవకాశాలు వచ్చి విబిన్నకులాలు ఆర్థిక,సామాజిక,రాజకీయ రంగాలలో నిలదొక్కుకోవడానికి అవకాశం లభిస్తుందనిదలచి,వెంటనే కేంద్రప్రభుత్వం కుల జనగణన చేపట్టాలని బీసీసంఘాలతో నేరుగా ఢిల్లీకి వెళ్లి అక్కడ కేంద్రమంత్రివర్గాన్ని,వివిధపార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు ఇవ్వడం,జంతర్ మంతర్ లో పలుమార్లు ధర్నా కార్యక్రమాలు చేపట్టి అరెస్టైన సందర్భాలెన్నో ఉన్నాయి.అంతేకాకుండా 18 రోజులపాటు హైదరాబాద్ కేంద్రంలో నిరాహార దీక్షచేసి అరెస్టయిన దాఖలాలు చూడవచ్చు.తన వాక్ చాతుర్యంతో బీసీల అభ్యున్నతికి అనునిత్యం ఏదోఒక కార్యక్రమం నిర్వహిస్తూ బీసీల చైతన్యంలో తనవంతు కృషిచేస్తూ ప్రజలమన్నలను పొందుతున్నారు.

**సామాజిక ఉద్యమాలలో తనబాట :**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకపాత్ర పోషించి,హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో భూమి ఆక్రమణకు గురైతే విద్యార్థులందరిని ఏకంచేసి దాదాపు వారం రోజులకుపైగా నిరాహారదీక్షలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంలో తనదైన పాత్ర వహించడం,తెలుగుభాష పరిరక్షణలో భాగంగా ధర్నాలు,రాస్తారోకోలు నిర్వహించడం,ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు దాదాపు 200మంది విద్యార్థులతో మూడురోజులపాటు నిరాహార దీక్షలు నిర్వహించి, సీతక్కతో మార్నింగ్ వాక్ నిర్వహించడం అప్పట్లో రాష్ట్రంలో చర్చనీయాంశమయ్యిందని చెప్పడంలో ఎలాంటి అబద్ధంలేదు.అంతేగకుండా దేశంలో ఎక్కడైనా ఎవ్వరికైనా అన్యాయం జరిగితే తన సామాజికభాధ్యతో స్పందిస్తూ భిన్నరూపాలలో నిరసన కార్యక్రమాలు చేయడం,ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్ ఆర్గనైజషన్స్ లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతూ,పలు ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ ఎంతోమంది మన్ననలు పొందడమే గాకుండా సమాజసేవ నేపథ్యంలో "ప్రైడ్ అఫ్ తెలంగాణ అచీవ్మెంట్ అవార్డు"తో సత్కరించబడటం పలువురికి ఆదర్శనీయమని చెప్పకతప్పదు.ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయపరిణామాల దృష్ట్యా,వివిధ రాజకీయపార్టీల మధ్య జరుగుతున్న సంఘర్షణ,వారు అనుసరించే ఎత్తుగడలను అంచనా వేసి,మనమెందుకు చట్టసభలలోకి వెళ్ళవద్దు ? రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకొని రాజకీయంగానే తనసేవలు అందించాలని దలచి,ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలపై స్పందిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా,రాష్ట్రంలోని విబిన్న రాజకీయపార్టీల దృష్టికి వెళ్లడం తనకే చెల్లిందని చెప్పవచ్చు.అలాగే తనకున్న పరిచయాలు,మేధాశక్తిని ఉపయోగించి పోరాటస్ఫూర్తితో,ప్రణాళికాయుతంగా చాపకిందినీరుల తనబలాన్ని పెంచుకుంటున్నారనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.ఇప్పటికే కొన్నిపార్టీలు అవకాశాలు ఇస్తామని తెలియజేసినప్పటికీ సరైన ప్లాట్ ఫామ్ మరియు సమయం కోసం వేచిచూస్తూ ముందుకు సాగుతుండడం గమనార్హం.అంటే నాయకుడిగా ఎదగాలంటే డబ్బుయే ప్రాధాన్యతకాదని పట్టుదలతో ధైర్యంగా ముందడుగు వేస్తే ఏదైనా సాధ్యమే అంటూ నిరూపిస్తూ వస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రాజకీయాలలోకి యువత రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.తన లక్ష్యాన్నికనుగుణంగా కార్యసాధన చూస్తుంటే ఎప్పటికైనా తాను అనుకున్నది సాధిస్తారనే నమ్మకం కలుగకమానదు.రాజ్యాంగంపై అవగాహన ఉండి,ధైర్యంతో ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలపై పోరాటంచేస్తూ,కులాలకతీతంగా సబ్బండవర్గాల వారికి అండగానిలిచి భరోసానిచ్చే శివముదిరాజ్ లాంటి యువత చట్టసభలలోకి వచ్చి ప్రజలకు సేవచేయాలని ఆశిద్దాం.

డా.పోలం సైదులు,
డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ,
9441930361.

# మైనార్టీ గురుకుల ప్రవేశాలకు ఆహ్వానం



**షాద్ నగర్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నాగులపల్లి రోడ్‌లోని మైనార్టీ గురుకుల విద్యాలయంలో ఐదవ తరగతి ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనూష తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులతో కలిసి బ్యానర్లు, పాంప్లెట్లు ఆవిష్కరించారు. ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మదీనా మస్జిద్ ఇమామ్ అబ్దుల్ హమీద్, మదీనా ఛానల్ సాబీర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం





**దేవరకొండ జనవరి 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణం లోమునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ I& II ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీని చేపట్టారు.ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య మాట్లాడుతూ, "ఓటు అనేది మన చేతిలో ఉండే అత్యంత పదునైన ఆయుధం. సమాజంలో మార్పు తీసుకురావడం కేవలం ఓటు ద్వారానే సాధ్యమవుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ నిజాయితీగా, అభివృద్ధిని కాంక్షించే వారికి ఓటు వేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి. మకట్లాల్, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ లో జాతీయ ఓటరు దినోత్సవం ప్రతిజ్ఞ



**దేవరకొండ జనవరి 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం లో ని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, సమాజంలో ఓటు అనేది మార్పు కోసం ఉపయోగపడే ఆయుధం అని,18 సంవత్సరాలు నిండిన అందరూ లింగ భేదం లేకుండా అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు అని,తమ ఓటు ను వినియోగించి సమాజంలో మార్పు కోరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంసుందర్, బిచ్చయ్య, జగన్నాథ్,రమా, వెంకటేశ్వర్లు, ఎన్.ఎన్.విజయ్ కుమార్, పి.రామారావు, చెన్నయ్య,సోమయ్య, విజయ్ కుమార్, రాజు, బాలకృష్ణ, రమేష్, రుంషా,శ్రీలత, ధనలక్ష్మి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

**-ప్రముఖ సంఘ సేవకుడు పాపి శెట్టి రాము**



**ఆమనగల్లు, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ప్రముఖ సంఘ సేవకుడు పాపి శెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కొండ ప్రాంగణంలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ శనివారం ముగిసింది. మొదటి బహుమతి రూ.30,000 షీల్డు ఆమనగల్లు నవచతన్య కాలనీ, రెండవ బహుమతి రూ.20,000 షీల్డు జంగారెడ్డి పల్లి రన్నర్ కు పాపిశెట్టి రాము మహేష్ సీఈఓ దేవేందర్, నాయకులు జెనిగేల గిరి యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై...శనివారం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గుజ్జరి గోపి, రంజిత్, నాగిళ్ళ సురేష్, జల్లెల శివ, బూర్గుపల్లి మహేష్, మహేష్, పవన్, మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నోట్లకు ఓట్లను అమ్ముకోవద్దు ఓటే వజ్రాయుధం

## బ్యాలెట్ బుల్లెట్ కంటే బలమైంది -అబ్రహం లింకన్

భారత దేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత జాతీయ నాయకులు దేశ పరిస్థితులను దృష్టిలో వుంచకొని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేశారు. .ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది.ఎన్నికల సంఘాన్ని జనవరి 25 న మొదటి గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థాపించారు.ఎన్నికల కమిషన్ ఏర్పడి 76 సం“రాలైన సందర్భంగా ఎన్నికల కమిషన్ 2026 జనవరి 25న దేశంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తుంది. దీని ఉద్దేశం ఓటర్లు తమ హక్కులు బాధ్యతలు ‘ఓటు హక్కు‘ ఓటు విలువ ‘ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన చైతన్యంకలిగిస్తారు. ఓటర్లతో సదస్సులు కళాశాల విద్యార్థులు యువజనసంఘాల చేత ర్యాలీలు వక్తృత్వ పోటీలు సెమినార్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో ఇప్పటి వరకు 17 లోకసభ ఎన్నికలు రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి కార్యాలయానికి ఒక్కొక్క దానికి 16 ఎన్నికలు 399 శాసన సభ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్వహించింది. .

**జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 థీమ్**

బలమైన ప్రజాస్వామ్యం కోసం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ(సర్) అనే నినాదంతో

అన్ని రాష్ట్రాలలో ఓటర్ల పక్షాళన మొదలుపెట్టి ఎన్నికల కమిషన్ తన పని చేసుకుంటూ వెళుతుంది.

యువకులు స్వచ్ఛందంగా మరియు బాధ్యతాయుతంగా ఓటు వేయాలి “అనే నినాదంతో ఈ ఏడాది 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది.

**వయోజన ఓటు హక్కు కల్పించబడింది**

భారత్ రాజ్యాంగం 326 ప్రకారం 18 సం“రాలు నిండిన జాతీయ పౌరులకు వయోజన ఓటుహక్కు కల్పించబడింది. కుల ‘మత ‘ లింగ ప్రాంత ‘ధనిక‘ పేద వివక్ష లేకుండా అక్షరాస్యులకు నిరక్షరాస్యులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కలిపించి ప్రపంచ రాజకియ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన

మార్పుకు శ్రీకారం చుట్టింది.

అభివృధి చెందిన దేశాల కంటె ముందే మన దేశంలో వయోజన ఓటింగ్ హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అన్న బరాక్ ఒబామా వ్యాఖ్య ఓటు హక్కు

ప్రాధాన్యతను ప్రజాస్వామిక వాదుల ఆమోదం పొందింది.

**ఓటు హక్కు వజ్రాయుధం**

ఓటు హక్కు అందరికీ వజ్రా యుధం అయింది. సామాన్యుని గొంతుకైంది .ఓటు హక్కు ద్వారా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కలిగి ఉన్నాడు. తమకు నచ్చిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అధికారం వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో సార్వ బౌమాధికారం అధికారం వుంటుంది.ఓటు హక్కు ద్వారా 5 ఏళ్ళకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ సార్వ భౌమాధికారాన్ని వినియోగిస్తారు.

ప్రజలే ప్రభువులు అమెరికా మాజీ అధ్యక్షులు “అబ్రహం లింకన్“ అభిప్రాయం ప్రకారం “ ప్రజలచేత ప్రజల కొరకు నిర్వహించబడే ప్రజల ప్రభుత్వం“ ప్రజాస్వామ్యం అని నిర్వచించారు ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజాస్వామ్య మనుగడకు ఓటే పునాది.

,ఎన్నికల కమిషన్ ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి తో పనిచేస్తూ ఓటరు నమోదు ఓటరు జాబితా తయారు ‘దేశంలో చట్టసభల స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికల్లో ఓటర్లు అందరు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

**ఓటు హక్కు నిర్లక్ష్యం**

దేశంలో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు1952 లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించారు. 2024నాటికి 66.10 శాతం




మంది ఓటు వేశారు.

కేవలం 22 శాతం మాత్రమే ఓటింగ్ పెరిగింది 72 ఏళ్లలో కేవలం 22% ఓటింగ్ పెరగడం గమనార్హం.

మొత్తం ఓటర్లలో 90 శాతం ఓటింగ్ జరిగితే దేశం అభివృధి పథంలో పురోగమిస్తుందన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్య ఓటర్లకు కనువిప్పు కావాలి..

యువత దేశ భవిత దేశ రాజకీయాల్లో యువత క్రియాశీలకంగా పాల్గొనాలి యువత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.ఓటు వేయడం పై ఆసక్తి చూపడం లేదు. సాధారణ ఎన్నికల్లో యువత ఓటింగ్ శాతం గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువ వుంటుంది.పట్టణ ప్రాంతాలలో చదువుకున్న వారు ఓటింగ్ పై ఆసక్తి చూపడం లేదు.

నోటుకు ఓటు ప్రజాస్వామ్యానికి చేటు ప్రజాస్వామ్యానికి ఓటు ఆయుధం ఓటరు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. కానీ రాజకీయ పార్టీలు ఓటును అంగడి సరుకుగా మార్చాయి .డబ్బు మద్యం వివిధ ప్రలోభాలకు ఓటును అమ్ముకునే నోటుకు ఓటు సంస్కృతి పెరిగి ప్రజాస్వామ్యానికి చేటుగా పరిణమించింది.రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బులుఎరగా చూపి ఓటు వేయించు కుంటున్నారు . దేశంలో రాజకీయ పార్టీలు గెలుపే ఏజెండాగా పోటీ పడుతున్నాయి ధనబలం పెరిగి పోయింది.దేశంలో మధ్యతరగతి ప్రజల సంఖ్య గణనీయంగా పెరిగింది . రాజకీయ పార్టీలు ఓట్లను అంగడి సరుకుగా మార్చి వేశాయి. రాజకీయ పార్టీలు హామీల హర్రసుపాట పాడుతూ ఓటర్లను వంచిస్తున్నారు.

**పెరుగుతున్న ఎన్నికల వ్యయం**

ఎన్నికల కమిషన్ సూచించిన దాని కంటే ఎన్నికల వ్యయం చేస్తున్న రాజకీయ పార్టీల మీద నియంత్రణ లేదు. ఈ పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి విఘాతం గా పరిణమించాయి.

ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజలు ప్రజా ప్రతినిదులను ప్రశ్నించే హక్కును కోల్పోతారు. ప్రజాసంక్షేమం కుంటుపడుతుంది.

దేశ భవిష్యత్తు నాయకుల చేతుల్లో వుంటుంది. ఆనాయకుల తలరాత మార్చేది ఓటు“ కాళోజీ అన్నట్లు “అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడాలి“ ప్రజలకు ఇప్పటివరకు ఏమిచేశాడో గమనించి నేరచరిత లేని నిజాయితీ వంతులను ప్రజా ప్రతినిధులు గా ఎన్నుకొని అవినీతి రహిత‘ నేరరహిత రాజకీయ వ్యవస్థకు ఓటర్లు ఉద్యమించాలి.

**ఓటు వజ్రాయుధం**

దేశ భవిష్యత్తు అభివృధి ప్రభుత్వాల మార్పుకు ఓటు వజ్రాయుధం లాంటిది. ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానాన్ని అమలు చెయ్యాలి. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో చూయిస్తున్న శ్రధకంటే ఎక్కువగా ఓటింగ్ హక్కు వినియోగం ఎన్నికల విధానం ఎన్నికల అక్షరాస్యత

ఇవిఎం ల ఉపయోగం మీద ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలి.

ఎన్నికల సమయంలో అభ్యర్థులు రాజకీయ పార్టీలు చేసే దేశ పూర్తి సంఘాలను ఎన్నికల కమిషన్ నిషేధించాలి ప్రజాస్వామ్యాన్ని చేస్తామని హోటల్ ప్రతిజ్ఞ చేసినప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది బలమైన ప్రజాస్వామ్యం కోసం ప్రత్యేక సమగ్ర జాబితాల సవరణలు అందరూ భాగస్వాములు కావాలి

**ఓట్ల నమోదు ఓటింగ్ ప్రక్రియ పై యువతకు శిక్షణ ఇవ్వాలి**

రాజకీయ పార్టీలు యువత విభాగం అధ్వర్యంలో ఓటు నమోదు ఓటరు గుర్తింపు ఆధార్ కార్డు తో ఓటరు కార్డు అనుసంధానం దొంగ ఓటర్ల గుర్తింపు ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తికి శిక్షణ తరగతులు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చెయ్యాలి.

**ప్రభుత్వం నిర్బంధ ఓటు హక్కును కల్పించాలి.**

ప్రభుత్వం ఎన్నికల కమిషన్ పౌరసమాజం యువత‘ మహిళా సంఘాలు‘ స్వచ్ఛంధ ‘సామాజిక సేవా సంస్థలు ఓటు హక్కు వినియోగం పై అవగాహన చైతన్యం కలిగించాలి.

కళాశాలల్లో ఓటు హక్కు వినియోగం మీద సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనల ద్వారా ఓటర్లను చైతన్య పరచాలి .

“ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటువేసి ఎన్నుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యాలి“

అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బల్లోపేతం అవుతుంది.

**ప్రలోభాలు వద్దు ఓిటు వినియోగమే ముద్దు**

భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు భారత దేశం చారిత్రకంగా వెనుకబడిన వర్గాలు దళితులు ఆదివాసీలు తాడితులు పీడిత వర్గాలు రాజకీయంగా అభివృధి చెందటానికి ఓటు హక్కు ముఖ్యమైన మార్గం అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఓటు విలువ తెలుసుకొని ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించు కోవాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం ప్రజల సామాజిక బాధ్యత. ఓటరుగా వున్నందుకుగర్వపడుతున్న ఓటు వేయడానికి సిద్దంగా వున్న అనేది నినాదం కాకుండా ఓటర్ల విధానంగా వర్ధిల్లాలి.

ఓటు వేద్దాం ప్రజాస్వామ్య పరిపుష్టికి పాటుపడుదాం అని ఓటర్లు ప్రతిజ్ఞ చేయాలి.

**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు
తెలంగాణ ఎకానమిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్ జస్టిస్
కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్
జస్టిస్ కుమారయ్య 1969 ఙ1971)
కరీంనగర్
9440245771



# ఘనంగా (నీలగిరి ఎక్స్‌ప్రెస్) క్యాలెండర్ ఆవిష్కరణ

**వెల్దండ, జనవరి 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో శనివారం నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక క్యాలెండర్‌తో పాటు తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజలకు నిత్యం సమాచారం అందిస్తున్న విశ్వసనీయ పత్రికగా గుర్తింపు పొందిందని



పేర్కొన్నారు. ఇలాంటి పత్రికలు సమాజానికి దిశానిర్దేశం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీను, మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, గుద్దటి కిష్టాలు, రంగనాథం, శ్రీరాములు, మల్లేష్, వెంకటయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

-రాయితీ పథకాలను ఎత్తేసిన ఘనత టిఆర్ఎస్ పార్టీ ది

-77 లక్షల 13 వేల రాయితీ ఉపకరణాల పంపిణీ ఎమ్మెల్యే




**వనపర్తి,జనవరి 24( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు పక్షపాతిగానే పనిచేస్తుందని రైతు రుణమాఫీ, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, రాయితీపై విత్తనాల పంపిణీ, ఎరువుల పంపిణీ, డ్రిప్పు పైపుల పంపిణీ, స్పింకులర్ల పంపిణీ, ట్రాక్టర్ల పంపిణీ, కల్టివేటర్లు, రోటవేటర్లు మందుల పిచికారి యంత్రాలు లాంటి అనేక ఉపకరణాలను రాయితీపై అందిస్తుందని వీటి ద్వారా రైతులకు దాదాపు రూ . 20వేల నుంచి 50 వేల రూపాయలు వరకు లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకారణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలకులు రైతుల పేరున అనేక మోసాలు చేశారని, అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ రాయితీ వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంను ఎమ్మెల్యే చెప్పారు.కేవలం రైతుబంధు పేరుతో రైతులకు లక్షల రూపాయలు ఆదా అయ్యే ఇలాంటి వ్యవసాయ ఉపకరణాలపై రాయితీలను ఎత్తేసి కేవలం రైతుబంధు పేరుతో ఆడంబరాలు ప్రచారాలు చేశారే తప్ప వారు రైతులకు చేసింది ఏమీ లేదని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మొదటినుంచి అన్నదాతల ఉపయోగార్థం కట్టిన ఎన్నో ప్రాజెక్టుల నుంచే నేటికి రైతులకు సాగునీరు అందుతుందని కేవలం కాలువలకు బొక్కలు పెట్టి మేము సాగునీరు తీసుకొచ్చామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు.గతంలో నిర్మించిన ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి నీళ్లు తెచ్చామని పూలు చల్లిన నాయకులు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పరమన్నారు.రైతులకు రుణమాఫీ విషయంలో పదేళ్ల కలలో లక్ష రూపాయల రుణమాఫీ చేయని వ్యక్తులు నేడు రుణమాఫీ గురించి అనవసరమైన మాటలు మాట్లాడడం విడ్డూరమన్నారు.రైతుల సౌకర్యార్థం వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలను, నియంత్రికులను ఇటీవల 50 కోట్ల రూపాయలు మంజూరు చేయించి సరి చేయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణకు, రద్దుకు తేడా తెలియని కొందరు నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఒక్కో జిల్లా పరిధిలో మూడు నాలుగు నియోజకవర్గాలు కలిసి ఉండే పరిపాలన విధానానికి ఇబ్బందిగా ఉండడంతో అలాంటి జిల్లాలను పునర్వ్యవస్థీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అవగాహన లేని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.వనపర్తి వేరుశనగ పంటకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని ఇందుకు సంబంధించి వేరుశనగ పరిశోధన కేంద్రాన్ని గతంలో పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టామని వీటి పనులం కూడా అతి త్వరలోనే వేగవంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.వేరుశెనగ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పనులు నేను చేస్తే కొందరు సన్నాసులు వాటిపై కూడా బిల్లులు చేసుకుని తిన్నారని ఆయన ఎద్దేవ చేశారు.వేరుశనగ పంట కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇట్టి విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పంట పొలాలకు 50 శాతం రాయితీ తో కంచ నిర్మాణం చేయించేందుకు తాను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాలాజీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

-ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి .

-బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ జనవరి 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రతి ఒక్కరూ బాలాజీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం పీఏపల్లి మండలం బాలాజీ నగర్ గ్రామంలో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలకు వంట సామాగ్రి అందజేత



**కల్వకుర్తి, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వంట సామాగ్రి అందజేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం, స్వచ్ఛమైన ఆహారం అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బాగు కోసం సేవా బృందం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు సరస్వతి, రజిత, మానస, సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**వంగూరు, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా బండపల్లి బాలస్వామి ఇంటి సామాగ్రి పూర్తిగా దగ్ధమై భారీ నష్టం వాటిల్లింది. ఈ ఘటనతో బాధిత కుటుంబానికి తోడుగా నిలిచిన బాల్య మిత్రులు, వంగూరు సర్పంచ్ పురుగులు యాదవ్, మాజీ సర్పంచ్ గణేష్ రావు, శివరాములు, శ్రీనివాసులు, చంద్రమోలి, లక్ష్మయ్య, వజ్రలింగం, ఉమా రాణి, అశోక్, రాధ, శంకర్ ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు కలిసి రూ.52,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.గ్రామస్తుల ఐక్యతతో అందించిన ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు బాధితులకు ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



**హుస్నాబాద్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు కానవేణి రజినీకాంత్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు సాధిక్ మసరత్ అలీ, ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్త సంధ్య పాల్గొన్నారు.వైద్య బృందం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించింది. బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిర్వహించిన ఈ శిబిరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల నుంచి మంచి స్పందన పొందింది.

# జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా తపస్విని కిడ్స్ ప్లే స్కూల్‌లో కార్యక్రమం



**వనపర్తి జనవరి 24( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా కేంద్రంలోని తపస్విని కిడ్స్ ప్లే స్కూల్ లో ఈరోజు సాయంత్రం నిర్వహించిన స్కూల్ అసెంబ్లీ కార్యక్రమం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రచయిత, జర్నలిస్ట్ గంగవరం రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన తెలుగు రాష్ట్రాల్లోని బాల బాలికలకు జాతీయ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బాలికల విద్య, భద్రత, సమాన అవకాశాలు సమాజ అభివృద్ధికి కీలకమని తెలిపారు. బాలిక చదువు దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.బాలికలపై వివక్షను తొలగించి, వారి కలలను గౌరవిస్తూ ఎదగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి బాలిక ఒక శక్తి, ఒక వెలుగు, ఒక మార్పు అని పేర్కొంటూ, బాలికలు గౌరవంగా, సురక్షితంగా జీవించినప్పుడే సమాజం నిజమైన ప్రగతిని సాధిస్తుందని గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు.

# శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయి.



**ఎలిగేడు, జనవరి 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండల కేంద్రానికి చెందిన కోట శ్రీకాంత్ అనే యువకుడు గత ఏడాది రోడ్డు ప్రమాదం లో మృతి చెందాగా అతని స్నేహితులు శ్రీకాంత్ స్మరకార్థం క్రికెట్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఉప సర్పంచ్ ,ముంజం నరేష్ ముఖ్య అతిధిగా వచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక, ఆరోగ్యానికి, మరియు క్రమశిక్షణకు దోహదపడతాయని గెలుపు ఓటములు సమానంగా స్వీకరించినప్పుడే జీవితంలో స్ఫూర్తిని అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి,చింతకుంట మనోహర్ రావు, వార్డు సభ్యులు మధు,కార్తీక్,నరేందర్, రాకేష్,తంగిళ్ళ శ్రీధర్,సత్యం,సాయి, క్రీడాకారులు సుమన్, సంపత్,ఆర్గనైజర్స్ రాకేష్ శ్రీకాంత్, శేఖర్,ప్రదీప్, నరేష్,సురేష్,రాకేష్, ప్రశాంత్, ప్రదీప్, నంబయ్య,అజయ్, రహీం, ఓదెలు, రాజేశం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# కండక్టర్ నుంచి ఐఏఎస్ వరకు



**కొండమల్లెపల్లి,జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సాధారణ కుటుంబంలో జన్మించి, ప్రభుత్వ సేవలో కండక్టర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన బంజార బిడ్డ నేనావత్ ఖిమ్యా నాయక్ అసాధారణ కృషి, పట్టుదల, అంకితభావంతో ఐఏఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. ఈ స్ఫూర్తిదాయక విజయంతో గాజినగర్ వద్య తండలో ఆనందం వెల్లివిరిసింది.ఈ ఘనతను పురస్కరించుకొని గ్రామస్తులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, శ్రేయోభిలాషులు పాల్గొని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సాధారణ స్థాయి నుంచి అత్యున్నత పరిపాలనా స్థాయికి చేరుకోవడం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చే విషయమని గ్రామస్తులు పేర్కొన్నారు.తన ప్రయాణం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, కష్టపడి ప్రయత్నిస్తే ఏ లక్ష్యమైనా సాధ్యమనే విషయానికి ఈ విజయం నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పని చేసి సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా ఖిమ్యా నాయక్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వద్య లక్కునాయక్, పత్య నాయక్, చందర్ సింగ్, పాపా, శంకర్, గోళ్ల, శ్రీను, రమేష్, బ్రమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కురవి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**కురవి, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా పాఠశాల పరిపాలన బాధ్యతలు చేపట్టి, వివిధ పదవులను నిర్వర్తించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎండి వహీద్ మాట్లాడుతూ, ఈ రోజు విద్యార్థులకు ఒక చిరస్మరణీయ అనుభవంగా నిలుస్తుందని, భవిష్యత్తులో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్జేడీగా కస్తూరి స్వాతి, డీఈవో గా తిప్పర్తి ఇందు, హెచ్ఎంగా ధైద అమూల్యతో పాటు సమీరా, వీరేందర్, ప్రేమ్ కుమార్, శృతి కీర్తన్, విఘ్నేశ్వరి, భవాని, ఉషారాణి, కావేరి, రేష్మ, విశాంతి, మేఘన, వంశీ కుమార్, దివ్య, మహిమ, శ్రావణి తదితరులు బాధ్యతలు నిర్వర్తించి బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా వెంపటి విజయ్ రాజ్, కో-కన్వీనర్‌గా శ్రీరామోజు విజయలక్ష్మి వ్యవహరించారు. ఉపాధ్యాయులు శ్రీధర్, లక్ష్మయ్య, ప్రేమ్ సాగర్, వెంకటేశ్వర్లు, నరసింహ చారి, వెంకన్న, రవీందర్, శ్యామల దేవి, మల్లికార్జున్, బాలాజీ, పద్మలత, యాకమ్మ, కళావతి, ఉదయమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ మహిళా అధ్యక్షురాలు మంద పద్మ




**మిర్యాలగూడ, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మిర్యాలగూడ పట్టణ రెడ్డికాలని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ మహిళా అధ్యక్షురాలు మంద పద్మ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ సమక్షంలో ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 35వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ధైద సత్యం ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర పరిపాలన అగమ్యగోచరంగా మారిందని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. మిర్యాలగూడ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ మాత్రమే కృషి చేస్తుందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, మక్దూం పాషా, పశ్య శ్రీనివాస్ రెడ్డి, పునాటి లక్ష్మీనారాయణ, షోయబ్, ధైదా వెంకటేష్, కోలా రామస్వామి, నేరెళ్ళ శివ, పెండెం పద్మావతి, షెహనాజ్ బేగం, కోదాటి రమ, సరస్వతి, జయమ్మ, మొండికత్తి లింగయ్య, సత్యనారాయణ, బాలు నాయక్ శ్రీకాంత్, శంకర్, నరేష్, కిరణ్, వెంకటేష్, రవి కిషోర్, సైదులు, పవన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో 'అరైవ్ అలైవ్' రహదారి భద్రతా ర్యాలీ



**మహబూబాబాద్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కలిసి ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం "అరైవ్ అలైవ్" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్‌లు కట్టుకోవాలని సూచించారు. ఇవి పాటిస్తే ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరోగ్య జీవన విధానమే ప్రకృతి వైద్యం

**- నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ నరసింహారావు నేత**




**నల్లగొండ ,జనవరి 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్);**
శనివారం స్థానిక ప్రభుత్వ ఆయుష్ శాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నేచర్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ జీవన అలవాట్లను పెంపొందించడమే కాక నిత్య యోగ సాధన వ్యాయామం అలవాటు చేసుకోవడం ద్వారా ఆనందంగా ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. యోగా ప్రాణాయామాల ద్వారా శారీరక మానసిక దృఢత్వం మెరుగవుతుందని, మసాజ్ తెరఫీ ద్వారా శరీరానికి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఒత్తిడి, రక్తపోటు, ఉబకాయం, షుగర్, వంటి జీవనశైలి వ్యాధులను నిర్మూలించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్,ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుహాసిని, ఆర్ఎంవోలు రజిని,కిరణ్, తులసి, మహేష్, స్వప్న, ఎన్ఆర్హెచ్ఎం డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్లు యశస్విని, రుచిత హౌస్ సర్జన్లు, డిపిఎంలు కేతన్, కళ్యాణ్, సిబ్బంది చంద్రయ్య, విజయలక్ష్మి, మెర్సి, యోగా ఇన్స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# దోరెపల్లిలో ఎన్ఎస్ఎస్

**విద్యార్థుల అవగాహన శిబిరం**



**నల్లగొండ, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎన్.జి. కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శీతకాల శిబిరం కోసం కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చేరుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా చేశారు. అనంతరం సామాజంలో వ్యాప్తి చెందిన మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నాటిక రూపంలో వాస్తవాలను వివరించారు. ఈ సందర్భంగా దోరెపల్లి సామాజిక కార్యకర్త అయితగోని సునీతనరేందర్ గౌడ్ విద్యార్థులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయంతో ఒకరోజు భోజనాలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజల క్షేమం కోసం ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టాస్క్ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగావకాశాలు

**-నియామక పత్రాలు అందచేసిన టాస్క్ సీఈఓ సీవోవో**



**హైదరాబాద్,జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో రెండు నెలలపాటు నిర్వహించిన సాంకేతిక, సాఫ్ట్ స్కిల్ శిక్షణ తరగతుల అనంతరం ప్రముఖ యూబీఎస్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలలో 200 మంది ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులలో 41 మంది ఎంపికయ్యారు. వీరికి ఆరు లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ సందర్భంగా టాస్క్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టాస్క్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

**-రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**





**ఆమనగల్లు, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
ఆమనగల్లు మున్సిపాలిటీలోని అయ్యప్ప కొండ ఆవరణలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యులు చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్, నాగిళ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ కు గోలి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ కు వచ్చిన రెండు జట్లలను అభినందించి పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, అంజి నాయక్, ఒగ్గు మహేష్, వడ్డె రాజు, రంజిత్, సుమన్ నాయక్, పూసల భాస్కర్, జంతుక కిరణ్, రమేష్, మహేందర్ గౌడ్, గబ్బర్ యాదవ్, గుజ్జరి గోపి, గణేష్, శివ, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# టీ పీసీసీ న్యాయ మానవ హక్కుల, సమాచార హక్కు కన్వీనర్,అధికారిక ప్రతినిధిగా శిరీష్ నియామకం

**ఆమనగల్లు, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కాంగ్రెస్ పార్టీ (న్యాయ,మానవ హక్కుల,సమాచార హక్కు కన్వీనర్ అధికారిక ప్రతినిధిగా) న్యాయ ప్రతినిధిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన న్యాయవాది ఆకుల శిరీష్ ను నియమిస్తూ పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆకుల శిరీష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, ఉస్మానియా యూనివర్శిటి విద్యార్థి నాయకుడిగా, ఎన్.ఎస్.యూ.ఐ. రాష్ట్ర నాయకులుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేసిన సేవలను గుర్తించి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయవాద విభాగంలో పట్టా పొందిన తనను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారని ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా తన నియమాకానికి సహకరించిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, చల్లా



వంశీచంద్ రెడ్డికి, ఎంపీ మల్లురవికి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**అభినందించిన వంశీచంద్ రెడ్డి**
కాంగ్రెస్ లీగల్ సెల్ మానవ హక్కుల,సమాచార హక్కు రాష్ట్ర అధికారిక కన్వీనర్ గా నియమితులైన ఆకుల శిరీష్ ను శనివారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా ఆకుల శిరీష్ ను పూల మాలలు, శాలువా కప్పి అభినందించారు.

# కండక్టర్ నుంచి ఐఏఎస్ అధికారి



**కొండమల్లెపల్లి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాజీనగర్ వడ్త్య తండకు చెందిన బంజార బిడ్డ నేనావత్ ఖిమ్యా నాయక్ కండక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి, పట్టుదలతో భారతీయ పరిపాలనా సేవ ఐఏఎస్ అధికారిగా ఎదగడం గ్రామానికి గర్వకారణమైంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సాధారణ స్థాయి నుంచి అత్యున్నత పరిపాలనా స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తినిచ్చే విషయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.తన ప్రయాణం కష్టపడి ప్రయత్నిస్తే ఏ లక్ష్యమైనా సాధ్యమని నిరూపించిందని, ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పని చేసి సమాజానికి సేవ చేయాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్త్య లక్కునాయక్, పత్య నాయక్, చందర్ సింగ్, పాపా, శంకర్, గోళ్ల, శ్రీను, రమేష్, బ్రమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయం కలగానే మిగిలేన ?



**పాలకుర్తి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : పెద్దపల్లి జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ఎప్పటిదాకా ఆలస్యం అవుతుందనే ప్రశ్నను పాలకుర్తి మండలానికి చెందిన సామాజిక కార్యకర్త చింతమల్ల రవి సమాచార హక్కు చట్టం ద్వారా లేవనెత్తారు.దీనికి కేంద్ర విమానయాన సంస్థ అధికారులు సమాధానమిస్తూ, పెద్దపల్లి జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు విషయమై తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని, ఈ ప్రశ్నను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగాలని సూచించారు. దీంతో విమానాశ్రయం ఏర్పాటు అంశం ప్రశ్నార్థకంగా మారింది.ఈ నేపథ్యంలో త్వరలోనే అప్పిలేట్ అధికారికి ఫిర్యాదు చేస్తానని రవి తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న పెద్దపల్లి జిల్లాలో ప్రజలకు విమానాశ్రయం అత్యవసరమని, కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు స్పందించి నిర్మాణంపై కీలక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కురుమలకు సీట్లు కేటాయించాలని డిమాండ్



**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కురుమలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కడారి అయిలన్న కురుమ, ట్రస్ట్ అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ డిమాండ్ చేశారు.కలెక్టరేట్ సమీపంలోని కురుమ సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో అన్ని రాజకీయ పార్టీలు కురుమలకు సీట్లు కేటాయించాలని కోరారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కురుమలు ధైర్యంగా పోటీ చేసి, ఇతర వర్గాల మద్దతుతో విజయం సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేశారు.నీతికి, నిజాయితీకి మారు పేరుగా ఉన్న కురుమలకు టికెట్లు కేటాయిస్తే వారు గెలుపు సాధించి పరిపాలనలో కూడా నిజాయితీగా సేవ చేస్తారని తెలిపారు. కాబట్టి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కురుమలు గెలిచే స్థానాల్లో సీట్లు కేటాయించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను ఆయన కోరారు.

# వి.బి.జి. రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ వ్యతిరేకతను ఎద్దేవా చేసిన బీజేపీ




**గంగాధర, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలో నిర్వహించిన బీజేపీ మండల స్థాయి కార్యశాలలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కూలీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత భారత్ గ్యారెంటీ రామ్ జీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ కేవలం అందులో 'రామ్' అనే పేరు ఉన్నందుకే వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.కేంద్రం చేపట్టిన ప్రతి మంచి పనికి కాంగ్రెస్ అడ్డుపడటం అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. రాఫెల్ యుద్ధ విమానాలు, ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, స్వచ్ఛ భారత్, వందే భారత్ రైళ్లు, నూతన న్యాయ సంహిత వంటి చారిత్రాత్మక నిర్ణయాలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని తిరస్కరించారని అన్నారు.125 రోజుల ఉపాధి గ్యారెంటీ, 15 రోజుల్లోపే వేతనాల జమ, ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ.86 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు పెంచడం, తెలంగాణకు అదనంగా రూ.346 కోట్ల నిధులు కేటాయించడం వంటి అంశాలను వివరించారు. డిజిటల్ హాజరు ద్వారా అవినీతికి తావులేకుండా కూలీలకు సరైన వేతనం అందుతోందని చెప్పారు.20042014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.1.89 లక్షల కోట్లను ఉపాధి పనులకు కేటాయిస్తే, 20142024 మధ్య మోడీ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లను కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.గ్రామాల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, మౌలిక వసతుల కల్పనకు ఈ చట్టం దోహదపడుతుందని, కూలీల సంక్షేమాన్ని అడ్డుకునే కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, ఉపాధ్యక్షులు కాడే నర్సింగమ్, కళ్లెం శివ, ఉపసర్పంచ్ బద్ధం లక్ష్మారెడ్డి, బండారి శ్రీనివాస్, యువ మోర్చా సభ్యులు ఎడవల్లి రామ్, లక్ష్మణ్, వంచ మనోజ్, జిట్టవేని అంజిబాబు, శెవెళ్ల అక్షయ్, దయ్యాల వీరమల్లు, పురంశెట్టి మల్లేశం, గోపు అనంత రెడ్డి, కుమ్మరి అనిల్, బీర్ల అనిల్ మరియు బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లమలలో మళ్లీ అలజడి



**అమరాబాద్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న నల్లమల ప్రాంతంలో మళ్లీ కలకలం రేగింది. ఇంటలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు కేంద్ర కమిటీ అగ్ర నేతలకు ఆశ్రయం కల్పించారన్న అనుమానంతో నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో ప్రజాసంఘాల నాయకులను స్టేట్ ఇంటలిజెన్స్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అమరాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి జక్క బాలయ్య, వంకేశ్వరం గ్రామానికి చెందిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు అంబయ్య, లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు యాదయ్యను అచ్చంపేట పట్టణంలో వారి ఇళ్లలోనే అదుపులోకి తీసుకున్నారని సమాచారం.ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతో నల్లమలలో కలకలం రేగింది. స్టేట్ ఇంటలిజెన్స్ వర్గాలు వారిని విచారిస్తున్నట్టు తెలుస్తోంది.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి మఫ్టీలో అదుపులోకి తీసుకున్న వారిని మీడియా ముందు ప్రవేశపెట్టాలని కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# జాతీయస్థాయిలో బల్మూర్ విద్యార్థి ప్రతిభ




**అమరాబాద్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బల్మూర్ మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్ విద్యార్థి పి. కిరణ్ సాగర్ తన ప్రతిభతో జాతీయస్థాయికి చేరుకున్నాడు. కలుపు మొక్కలను తొలగించే యంత్రాన్ని రూపొందించి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అవార్డు సాధించాడు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకుని సంగారెడ్డిలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల సైన్స్ ఫెయిర్‌లో కూడా మొదటి స్థానం సాధించి జాతీయస్థాయిలో అర్హత పొందాడు.విద్యార్థి విజయంపై షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆలేటి కృష్ణయ్య అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు, హాస్టల్‌కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.గైడ్ ఉపాధ్యాయుడు హరియ, ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు కూడా కిరణ్ సాగర్‌ను అభినందించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి సింహం గుర్తుతో బలమైన పోటీ



**పెద్దపల్లి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పూర్తి ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ తరఫున సింహం గుర్తుపై పోటీ చేయనున్న అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత, స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి సింహం గుర్తు కేటాయించి గెలుపు దిశగా తీసుకెళ్లేందుకు కవిత కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో పోటీ చేయనున్న అభ్యర్థుల విజయానికి పార్టీ యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తుందని తెలిపారు.ఇప్పటికే అవసరమైన ప్రణాళికలు, వ్యూహాలు సిద్ధంగా ఉన్నాయని, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహభరితంగా పని చేయడానికి సిద్ధమయ్యారని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, స్థానిక పాలనలో పారదర్శకత, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ జాగృతి ప్రజలకు నమ్మకమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని బండారి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

# మెగా జాబ్ మేళాలో గాయత్రి కళాశాల విద్యార్థుల విజయాలు




**పెద్దపల్లి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో గాయత్రి డిగ్రీ అండ్ పిజీ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు.ఈ మేళాలో పాల్గొన్న పి. ఆశ్రిత ప్రసన్న (బీఎస్సీ ఎం ఎస్ టి డి ఎస్), కాసర్ల శ్రీజ (బీఎస్సీ ఎం ఎస్ టి డి ఎస్), ఎం.డి. తాజ్ బాబా (బీకాం సి.ఏ) అన్ని రౌండ్లలో ప్రతిభ కనబరచి హైదరాబాద్‌కు చెందిన హెచ్ వన్ హెచ్ ఆర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు.విజయం సాధించిన విద్యార్థులకు హెచ్‌ఆర్లు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జె. రవీందర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.ఈ విజయంతో గాయత్రి కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు.

# మావోయిస్టులు గన్ దించి రాజ్యాంగ బాటలోకి రావాలి




**- సీపీ అంబర్‌కిషోరా**

**రామగుండం , జనవరి 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మావోయిస్టులు హింసా మార్గాన్ని పూర్తిగా వీడి, ఆయుధాలను విడిచిపెట్టి రాజ్యాంగ బాటలో నడవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా పిలుపునిచ్చారు. అరణ్య జీవితం, అజ్ఞాతాన్ని వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం తరఫున పూర్తి భద్రతతో పాటు పునరావాసం, ప్రోత్సాహక పథకాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో సీపీ ఎదుట మొత్తం 8 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళా మావోయిస్టు కాగా, మావోయిస్టు ముఖ్య నేత శ్రీకాంత్‌తో పాటు మరో ఏడుగురు ఉన్నారని అధికారులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టు మిలీషియా, కొరియర్ విభాగం, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ స్థాయిలో పనిచేసినవారిగా గుర్తించినట్లు సీపీ వెల్లడించారు.ఈ సందర్భంగా సీపీ అంబర్‌కిషోర్ ఝా మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, హింసను సృష్టించే మార్గం చివరికి నేరస్తుల జీవితానికే దారితీస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధికి అడ్డుగా నిలిచే హింసను విడిచి, శాంతియుత జీవితం వైపు అడుగులు వేయాలని సూచించారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ రక్షణ కల్పిస్తామని, పునరావాస పథకాలు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలను వర్తింపజేస్తామని తెలిపారు.పోరు వద్దుడ ఊరు ముద్దు అనే భావనతో ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడి సాధారణ జీవన స్రవంతిలో కలవాలని సీపీ పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల పరిశీలన



**కరీంనగర్, జనవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కరీంనగర్ ఆర్టీసీ బస్ స్టాండ్‌లో బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల అమలు పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా కాటన్, రోలర్ బాండేజ్, డ్రెస్సింగ్ ప్యాడ్స్, పావిడిన్ అయోడిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పారాసిటమోల్ ట్యాబ్లెట్లు, ప్లాస్టర్, సర్జికల్ గ్లౌజులు వంటి ప్రాథమిక వైద్య సామగ్రి తప్పనిసరిగా ఉండాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది తక్షణమే ప్రాథమిక చికిత్స అందించేలా సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రయాణికుల ప్రాణ భద్రతకు రోడ్డు భద్రతా నిబంధనల అమలు అత్యంత ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సనా జవేరియా, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ రోడ్డు భద్రతా పోస్టర్ల ఆవిష్కరణ



**హైదరాబాద్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
37వ జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం-2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి తన కార్యాలయంలో రోడ్డు భద్రత విద్య మరియు రోడ్డు సైన్ చార్ట్ అనే థీమ్‌తో ఏ ఆర్ ఆర్ ఐ వి ఈ ఏ ఎల్ ఐ వి ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, ఇతర రహదారి వినియోగదారులను గౌరవించాలని కోరారు. సురక్షితమైన రోడ్ల నిర్మాణం అందరి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛందంగా ఈ నియమాలను పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఘనహాంబ్ ఓజా, విజయ్ ఓజా, కృష్ణకాంత్ తివారీ, రక్షంద పాండే ఓజా, అవిశ్రీ పాండే తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**మానకొండూర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియాతో కలిసి తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల వ్యాధి నిరోధక టీకాల నిల్వ కోసం ఉపయోగించే ఐఎల్ఆర్ మరియు దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న గర్భవతి మహిళ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆమె ఎంసీపీ కార్డును పరిశీలించారు.అవుట్ పేషెంట్లను పలకరిస్తూ వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. పీహెచ్సీ డెలివరీలను మెరుగుపరచాలని, గర్భవతుల చెకప్స్ సంఖ్యను పెంచాలని, అభా కార్డుల క్రియేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. 13 ఏళ్ల పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసిన వారిని రీ-స్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేసి ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ప్రసూతి గది పరిశుభ్రతను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసిల్లా, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయోగాత్మకంగా ఇసుక ఆన్లైన్ బుకింగ్ - పమేలా సత్పతి




**కరీంనగర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇసుక అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ వ్యవస్థను ప్రవేశపెడుతోందని టీజీఎండీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మైన్స్ మరియు జియోలజీ డైరెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఈ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశం జరిగింది.భవేశ్ మిశ్రా మాట్లాడుతూ మన ఇసుక వాహనం యాప్ ద్వారా వినియోగదారులు నేరుగా ఇసుకను బుక్ చేసుకోవచ్చని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సరఫరా జరుగుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేక ఆప్షన్ కల్పించామని, లబ్ధిదారులు 25 క్యూబిక్ మీటర్ల ఇసుక పొందవచ్చని తెలిపారు. ప్రయోగాత్మక జిల్లాల అనంతరం రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఈ విధానం అమలు చేస్తామని వెల్లడించారు.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో పనిచేసి ఈ కొత్త విధానాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని, 15 రోజుల్లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ప్రాజెక్టు మేనేజర్ రాధాకృష్ణ, తహసీల్దార్లు, మైనింగ్, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మానేరు ఒడ్డున నూతన కర్మకాండ నిలయానికి భూమి పూజ



**కరీంనగర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ పట్టణంలోని మానేరు ఒడ్డున తీగల బ్రిడ్జ్ సమీపంలో హనుమాన్ దేవాలయం పక్కన నూతన కర్మకాండ నిలయ నిర్మాణానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.15 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో చర్యలు చేపట్టారు.శనివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు, మాజీ మేయర్లు డి. శంకర్, సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు రాజేంద్రప్రసాద్, సాయిని మల్లేశం, జీవి రమణ, అవదుర్తి శ్రీనివాస్, శ్రీధర్, కె.పి. చంద్ర, వెంకట్ రెడ్డి, పుర ప్రముఖులు చందా లక్ష్మీనారాయణ, ముత్యం లు తదితరులు పాల్గొన్నారు. అర్చకులు పేరుకల రాజయ్య భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కరీంనగర్ పట్టణంలో సొంత నివాసం లేని అనేక కుటుంబాలు తమ వారిని కోల్పోయినప్పుడు కర్మకాండలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిని గమనించి కేంద్ర మంత్రి బండి సంజయ్ కర్మకాండ నిలయం ఏర్పాటు కోసం ముందడుగు వేశారని తెలిపారు. మరణించిన వారి ఆత్మ శాంతి కోసం అంత్యక్రియలు సక్రమంగా జరగడానికి, కర్మకాండలు శ్రద్ధగా నిర్వహించడానికి అవసరమైన సదుపాయాలతో ఈ భవనం నిర్మించబడనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆనంద్ మార్గ్ పర్ చారిక సంఘం బాధ్యులు కూడా పాల్గొన్నారు.

# పల్లెబాట కార్యక్రమంలో గ్రామ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలన




**పెద్దపల్లి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించి గ్రామ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామం మొత్తం తిరిగి మౌలిక వసతుల లోపాలను గుర్తించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెర్క రిబ్కా సంతోష్, ఏఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ మొండయ్య, జేఎల్ఎం వెంకటేష్‌తో పాటు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ పోల్స్, తెగిపోయిన వైర్లు, ఇతర విద్యుత్ సమస్యలను అధికారులు పరిశీలించారు.గ్రామ ప్రజలు వివరించిన ఇబ్బందులను విన్న అధికారులు, గుర్తించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్, వైర్లు వెంటనే మరమ్మతులు చేసి భద్రత చర్యలు చేపడతామని తెలిపారు.పల్లెబాట కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడం వల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# తిమ్మాపూర్‌బెజ్జంకి మండలాల్లో అభివృద్ధి పనులకు నాంది



**మానకొండూర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం శ్రీకారం చుట్టారు. ఎల్ఎండీ కాలనీలో చేపలవాడ నుంచి గురుకుల ప్రతిభా కేంద్రం మీదుగా ఈనాడు చౌరస్తా వరకు రూ.5.55 లక్షలతో విద్యుద్దీకరణ పనులు ప్రారంభించారు. విద్యార్థులు, వాహనదారులు రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దీపాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్, రేగులపల్లి, గుండారం, గూడెం గ్రామాల్లో పాఠశాలలకు ప్రహారీ గోడల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పాఠశాలలకు భద్రత పెరగడంతో పాటు ప్రశాంత వాతావరణం నెలకొంటుందని చెప్పారు. తోటపల్లి గ్రామంలోని ఎల్లమ్మ గుడి ఆవరణలో కొత్త బోరును ప్రారంభించి భక్తులకు నీటి సౌకర్యం కల్పించారు. బెజ్జంకి క్రాస్ రోడ్, పోతారం, గూడెం గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి, రేగులపల్లి, గూడెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పోతారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, తొలి విడత ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు జరిపించాలని, రెండో విడత మంజూరు ముందే పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్జీవోల సంఘం నూతన వార్షికోత్సవ డైరీ ఆవిష్కరణ



**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి చేతుల మీదుగా తెలంగాణ ఎన్జీవోల సంఘం, కరీంనగర్ జిల్లా డైరీ2026 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా ఎన్జీవోల సంఘం అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉద్యోగులందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసి, డైరీలో పొందుపరిచిన మీడియా, ప్రెస్‌కు సంబంధించిన ముఖ్యమైన ఫోన్ నంబర్లు, ఉద్యోగులకు అవసరమైన జీవోలు, జిల్లా స్థాయి అధికారుల సంప్రదింపు వివరాలు ఎంతో ఉపయోగకరమని అభినందించారు. ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమగ్ర సమాచారాన్ని ఒకే డైరీలో అందుబాటులో ఉంచినందుకు సంఘ నాయకులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు ఉద్యోగులకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సహాధ్యక్షులు ఓఁటెల రవీందర్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి అంబటి నాగరాజు, జిల్లా నాయకులు శారద, సబితా, హరిప్రియ, సుస్మిత, సరిత, శైలజ, స్వర్ణలత, సూర్య, కామ, సతీష్, బాస, పవన్ కుమార్, ఎండి అస్గర్ అలీ, కరుణాకర్, వెంకటరెడ్డి, దొంత రాజు, తాళ్ల నారాయణ, రాజేష్, ఎడ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు సకిలాం గంగాధర్, చకిలం శ్రీనివాసులు, ఆలయ ఈవో సుధాకర్ తదితరులు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. అదే రోజు రాంనగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనాన్ని మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్‌తో కలిసి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగర అభివృద్ధికి 1600 కోట్ల రూపాయలు తీసుకువచ్చి సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్కు నిధులు కేటాయించలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మానే రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రారంభించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ఆపేయడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి ఆగిపోయిందని, కరీంనగర్ గడ్డి దీపంగా మారిందని వ్యాఖ్యానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేష్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు మిడిదొడ్డి నవీన్, కాపు కులస్తులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ బైక్ ర్యాలీతో రోడ్డు భద్రతా అవగాహన



**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్మెట్ ధారణ ప్రాణరక్ష కలెక్టర్ పమేలా సత్పతి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డీజీపీ ప్రారంభించిన ఎరైవ్ ఎలైవ్) కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలవుతోందని తెలిపారు. దేశంలో 22 కోట్ల 10 లక్షల బైక్‌లు ఉన్నాయని, ప్రమాదాల సమయంలో తలకు గాయం కాకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని గుర్తుచేశారు. వాహనదారులు వ్యక్తిగత భద్రత పాటించడంతో పాటు ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరపున హెల్మెట్లు పంపిణీ చేశారు. 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చు సీపీ గౌష్ ఆలం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, గతేడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మరణించగా, అందులో 40 శాతం టూ వీలర్ వాహనదారులేనని తెలిపారు. మరణించిన వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను 90 శాతం వరకు నివారించవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీ మార్గం

పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ర్యాలీ బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దండ ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వెల్దండ, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్ సేవల అమలు, ఆసుపత్రిలోని వసతులను స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ తనిఖీలో డీఎంహెచ్ఐ రవికుమార్, తహశీల్దార్ కార్తీక్ కుమార్, వైద్య సిబ్బంది, సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల బీజేపీ ఆశావాహుల కలిసికట్టుగా ప్రచారం



**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ 57వ డివిజన్ (గణేష్ నగర్, దోబివాడ)లో బీజేపీ టికెట్ ఆశిస్తున్న నేతలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, డివిజన్‌లో టికెట్ కోసం తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ, టికెట్ కంటే పార్టీ ముఖ్యం అని, ఎవరికీ టికెట్ ఇచ్చినా సమిష్టి కృషితో పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ, డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్లెం కవిత వాసుదేవ రెడ్డి, తనకు సాయి ప్రియ (సాయి కృష్ణ), కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, జంగాలపల్లి శ్యామల కుమార్, బొడ్ల ఆగమ్మ (శ్రీరాములు), కొత్తకొండ అరుణ్ కుమార్, సోమ మహేష్, దేవిశెట్టి నవీన్ కుమార్, పంకిర్ల రవీందర్, గుంటుక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు




**కరీంనగర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక వేధింపులను ఎదుర్కోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎలాంటి న్యాయపరమైన సహాయం అవసరమైనా అందించడానికి సిద్ధంగా ఉంటుందని తణుకు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# మేడిపల్లి సత్యం సమక్షంలో పూరెల్ల సరోజ మధు కాంగ్రెస్‌లో చేరిక




**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని 62వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు పూరెల్ల సరోజ మధు, తన భర్తతో పాటు 200 మంది అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 36, 27వ డివిజన్లకు చెందిన కార్యకర్తలు కూడా ఈ చేరికలో భాగమయ్యారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, సుడ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్టిఏ నెంబర్ పడాల రాహుల్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ హయాంలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పూరెల్ల సరోజ మాట్లాడుతూ, తాను గత 15 సంవత్సరాలుగా బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ మహిళలకు ప్రాధాన్యత లేకపోవడంతో, మహిళలకు పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తన డివిజన్ ప్రజల కోరిక మేరకు కాంగ్రెస్‌లో చేరి, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి సహాయం చేస్తానని, బంపర్ మెజార్టీతో గెలిచి వస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, మల్లికార్జున రాజేందర్, శ్రావణ్ నాయక్, మూల రవీందర్ రెడ్డి, అబ్దుల్ రెహమాన్, చర్ల పద్మ, ఉప్పరి విశాల్, కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ మండల కన్వీనర్‌గా గుమ్మడి మహేందర్



**తిమ్మాపూర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ల జనరల్ బాడీ సమావేశం ఎల్ఎండీ దుర్గామాత ఆలయ ఆవరణలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. మండల పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, గ్రామీణ కార్మిక సంఘాల బలోపేతం కోసం కొత్త కమిటీ కృషి చేయాలని ఆయన సూచించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా ప్రజల హక్కులను హరిస్తూ, కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు ఇచ్చిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించిందని ముకుందరెడ్డి విమర్శించారు. లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, భీమా రంగంలో విదేశీ పెట్టుబడుల అనుమతి వంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆందోళనలు కొనసాగిస్తోందని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.నూతన మండల కమిటీ కన్వీనర్‌గా గుమ్మడి మహేందర్‌ను, సభ్యులుగా కన్నం నర్సయ్య, నాయిని రజిత, గంధం వేణు, చంద్రమౌళి, వెంకట రమణ చారి, బూడిద రజిత, తిరుపతి, ఐలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మడిపెల్లి మహేందర్, కమిటీ సభ్యులు రాగుల తిరుపతి, నాయకులు కొంగ్ర నిర్మల, దుడేల సమ్మయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**పెద్దపల్లి, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో రూ.22.27 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం అవసరమైతే మరిన్ని నిధులు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో నిలిచిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరుగుతుందని, అర్బన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా రూ.63 కోట్లు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు. ప్రజలకు సమన్యాయం చేయడమే తన ధ్యేయమని, ఎప్పుడూ ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్నానని చెప్పారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన పెద్దపల్లి పట్టణం ఇప్పుడు కాంగ్రెస్ హయంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, కోర్టు భవనం వంటి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తీర్చేందుకు కంటిమీద కునుకు లేకుండా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే విజయరమణరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర ఆలయంలో టెంకాయ టెండర్



**షాద్‌నగర్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం టెంకాయల టెండర్‌ను పారదర్శకంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మోహన్, దేవాలయ ఈవో శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో యాదయ్య రూ.35 లక్షలకు టెండర్‌ను పొందారు.ఈవో శివకుమార్ మాట్లాడుతూ, టెండర్ ద్వారా వచ్చే ఆదాయం దేవాలయ అభివృద్ధికే వినియోగిస్తామని తెలిపారు. టెండర్ కాలపరిమితి ఫిబ్రవరి 1, 2026 నుండి జనవరి 31, 2027 వరకు కొనసాగనుంది. 48 గంటల్లో 50 శాతం, 90 రోజుల్లో మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానస సురేష్, మాజీ సర్పంచ్ సంపత్ కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, మిలటరీ వెంకట్ రెడ్డి, అశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మేయర్ సునీల్ రావుపై కాంగ్రెస్ నేత రాజన్న తీవ్ర విమర్శలు

**కరీంనగర్, జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు గతంలో తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ 42వ డివిజన్ కాంగ్రెస్ నేత డాక్టర్ రాజన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు.డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, అవసరమైతే కలెక్టరేట్ హెలిపాడ్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో తడి బట్టలతో వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధమని ప్రకటించారు. అదే విధంగా, సునీల్ రావు కూడా మేయర్‌గా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడలేదని నిరూపించాలంటే హనుమాన్ పాదాల వద్ద ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.రాజన్న మాట్లాడుతూ, రాజకీయంగా ఎదిగింది సునీల్ రావు అయితే, తాను కష్టార్జితంతో ఉద్యోగం చేసి ఎదిగానని, ప్రజా సేవ చేయాలని వచ్చిన వెలిచాల రాజేందర్ రావుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. సునీల్ రావు అవినీతికి పాల్పడిన




విషయాలు నగర ప్రజలందరికీ తెలుసని, అసభ్యకరమైన పదజాలంతో ఆరోపణలు చేయడం తగదని విమర్శించారు.తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే ఆధారాలు బయట పెడతానని హెచ్చరించారు. ఎప్పుడైనా మంచితనమే గెలుస్తుంది, అవినీతి కాదు అని రాజన్న స్పష్టం చేశారు.సునీల్ రావు గత రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్‌లో పనిచేసి తర్వాత టీఆర్ఎస్‌లో చేరి మేయర్‌గా ఉన్నారని, అనంతరం బీజేపీలో చేరారని గుర్తుచేశారు. బండి సంజయ్ విషయంలో సునీల్ రావు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.రాజన్న చివరగా, తాను ప్రజల ఆదరణతోనే నిలబడతానని, ఇకపై సునీల్ రావు అవినీతి చిట్టాను బయట పెడతానని హెచ్చరించారు.

# కరీంనగర్ మున్సిపల్ అవినీతి ఆరోపణలపై మైనారిటీ సంఘం డిమాండ్

**కరీంనగర్ ,జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన పత్రికా సమావేశంలో, నగరపాలక సంస్థలో గత పదేళ్లుగా విచ్చలవిడిగా అవినీతి జరిగిందని ఆరోపించారు.తాజుద్దీన్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ మేయర్ సునీల్ రావు సహకారంతో కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందని, విదేశాల్లో ఉన్న వ్యక్తి పేరుపై దొంగ సంతకాలు చేసి కాంట్రాక్టులు పొందారని ఆరోపించారు. ముఖ్యంగా హుస్సేనీపుర వార్డులు 7, 8, 27, 5లో అభివృద్ధి పనుల నిధులు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. మజ్లిస్ పార్టీ మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ కుమారుడు ఇబ్రహీం అబ్బాస్ 2016 నుంచి సౌదీ




అరేబియాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, ఆయన పేరుపై 34 కాంట్రాక్టులు ఇచ్చి చెల్లింపులు జరిపినట్లు 2021లో సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన వివరాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. అయితే, మున్సిపల్ కమిషనర్ లోకాయుక్తకు సమర్పించిన నివేదికలో ఎలాంటి కాంట్రాక్టులు ఇవ్వలేదని పేర్కొనడం అవాస్తవమని ఆరోపించారు.అవినీతిని కప్పిపుచ్చేందుకు తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని, జిల్లా కలెక్టర్ పునర్విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని తాజుద్దీన్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మైనారిటీ జిల్లా స్పోక్స్‌పర్సన్ మహమ్మద్ అబ్దుల్ జమీల్, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మైనారిటీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఖలీముద్దీన్, లయీక్ ఖాద్రి, నిహాల్ అహ్మద్, మొహమ్మద్ అమీర్, షేక్ చాంద్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు షబానా మొహమ్మద్, షేక్ అజిముద్దీన్, మొహమ్మద్ అజమత్, మొహమ్మద్ హనీఫ్, సయ్యద్ ఖలీల్, అబ్దుల్ బారి, బషీరుద్దీన్, ఆరిఫ్ ఖాన్, షాహిద్ అఫ్రిది, షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లి గుట్ట ఓదెల మల్లన్న గుడి మహిమ

**హుస్నాబాద్ , జనవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన ఓదెల మల్లన్న గుడి గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు, విశ్వాసానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. వందేళ్లుగా తరతరాలుగా భక్తుల మనసుల్లో నిలిచిపోయిన ఈ ఆలయం, తన మహిమలతో ఇప్పటికీ అద్భుతాలను ఆవిష్కరిస్తూనే ఉంది. గుట్టపై స్వామి అవతరించిన సమయంలో వినిపించిన భారీ శబ్దాలు దైవ సంకేతాలుగా భావించి గ్రామస్తులు పవిత్ర స్థలంగా పూజలు ప్రారంభించారు. ఆకాశంభూమి మధ్య ఆధ్యాత్మిక శక్తి ప్రసరిస్తున్నట్టుగా అనిపించే ఈ గుట్ట, ప్రతి ఒక్కరి మనసులో భక్తి జ్వాలలను వెలిగిస్తోంది. ఇక్కడ లభించే తీర్థం రైతులకు వరమై, రోగులకు ఉపశమనంగా నిలుస్తోంది. పెద్ద రాతి నుంచి ఉద్భవించే ఈ తీర్థాన్ని పొలాల్లో చల్లితే పంటలు బాగా పండుతాయని, భక్తులు స్వీకరిస్తే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని నమ్మకం తరతరాలుగా కొనసాగుతోంది.జాతి, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ ఒకే గూటికి చేరి స్వామిని దర్శించుకోవడం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. జాతరలు, పూజలు, ప్రత్యేక వేడుకల సమయంలో గుట్ట అంతా భక్తి సందడితో నిండిపోతుంది.మల్లన్న స్వామి కథలు, జానపద గీతాలు, పూజా విధానాలు గ్రామ సంస్కృతిని తరతరాలకు అందిస్తున్నాయి. పండుగ రోజుల్లో గుట్టపై వెలిగే దీపాలు, వినిపించే మంత్రోచ్ఛారణలు భక్తులను ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళ్తాయి.ఓదెల మల్లన్న గుడి మా గ్రామానికి గర్వకారణం. ఇది కేవలం రాతి కట్టడం కాదుభక్తుల హృదయాల్లో వెలిగే నమ్మక దీపం. రైతులకు వరమై, రోగులకు ఆశగా, గ్రామానికి ఐక్యతగా నిలుస్తున్న ఈ ఆలయం, మల్లన్న స్వామి కృపతో గ్రామం సస్యశ్యామలంగా, ఆరోగ్యవంతంగా, ఆనందంగా నిలవాలని ప్రతి భక్తుడి ఆకాంక్ష.

# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**వర్ధన్నపేట, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారీ పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని ల్యాబర్తి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ల్యాబర్తి గ్రామానికి చెందిన
గీత కార్మికుడు నాల్లం సుధాకర్ గౌడ్ రోజు మాదిరిగానే వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కారు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం108 సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

**పరామర్శించిన కల్లు గీతా కార్మిక సంఘం నాయకులు**

ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలైన గీత కార్మికుడు నాల్లం సుధాకర్ గౌడ్ ను కల్లు గీతా కార్మిక సంఘం నాయకులు



పరామర్శించారు.ల్యాబర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి కిందపడి ఎంజిఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కల్లుగీత కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్ళపెల్లి నర్సయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి మేరుగు విరస్వామి గౌడ్, గౌరవ సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్, మండల అధ్యక్షులు జనగాం యాకయ్య గౌడ్, ల్యాబర్తి సొసైటీ అధ్యక్షులు బత్తిని రాజబాబు గౌడ్ ఎంజిఎం ఆసుపత్రికి వెళ్లి సుధాకర్ గౌడ్ ను పరామర్శించి, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# అడుగడుగునా నీరాజనాలు





**షాద్‌నగర్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన 'జన ప్రభంజనం' ర్యాలీ విశేష ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి కలిసి పాల్గొనడంతో జనసంద్రం ఉప్పొంగింది. ప్రజల ఆశీర్వాదాలతో ముందుకు సాగిన ఈ ర్యాలీ పట్టణ వీధుల్లో ఉత్సాహాన్ని నింపింది.ర్యాలీ మార్గమంతా కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు నీరాజనాలు పలుకుతూ ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ నాయకులపై అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి అడుగులోనూ నినాదాలు మారుమోగి వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు ప్రజలకు అభివాదం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు కోరారు. పట్టణాభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందని హామీ ఇస్తూ, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. ర్యాలీ ముగిసే వరకూ ప్రజల భాగస్వామ్యం విశేషంగా కనిపించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

# తపస్‌లో కొత్త ఉపాధ్యాయుల చేరిక




**ఇబ్రహీంపట్నం, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఈ రోజు సాయంత్రం తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తపస్‌లో చేరారు. నర్ల కరుణాకర్, శ్రీనివాస్‌తో పాటు గురుకుల ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, సంతోష్ కుమార్‌లు సంఘంలో సభ్యత్వం పొందారు.తపస్‌లో చేరిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ సంఘ సిద్ధాంతం, జాతీయ భావాలు, విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తపస్ చేస్తున్న కృషి, సంఘ పనితీరును చూసి తాము తపస్‌లో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు నర్సింహా, కర్ణాకర్ రెడ్డి, కృష్ణ, మండల బాధ్యులు రవీందర్, వడ్ల రాజేందర్, రాపోలు ప్రవీణ్ కుమార్, రావుల శివకుమార్, శివ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమంత్ చంద్రన్న ను మరవదు దేవరకొండ గడ్డ



**దేవరకొండ జనవరి 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న చంద్రన్న విగ్రహానికి వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం నాయకులు చంద్రన్న చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు దివంగత కార్మిక నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజల మనిషి, పేద ప్రజల పక్షాన,కార్మికుల పక్షాన అండగా నిలబడే ఆపద్బాంధవుడిగా అందరికీ అన్నగా ఎదురులేని ప్రజా నాయకుడిగా ఎదిగి అర్ధాంతరంగా మనందరికీ దూరమై 21 సంవత్సరాలు గడిచిన పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. దేవరకొండ మాజీ సర్పంచ్ స్వర్గీయ హనుమంతు చంద్రన్న 21వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు చంద్రన్న పౌండేషన్ తరపున .దేవరకొండ మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తాటికోలు జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థి ఎం.డి.ఫర్హాన్ కి, చంద్రన్న గోల్డ్ మెడల్ ప్రతిభా పురస్కారం, ,50000 వేల రూపాయల నగదు,గోల్డ్ మెడల్, పాఠశాలకు షీల్డ్ అందించడం జరిగింది.అనంతరం కోదండ రామాలయం లో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చంద్రన్న కుమారులు హనుమంతు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, నియోజకవర్గ నాయకులు, చంద్రన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మరక్షణ సభవిజయవంతం









**బాలాపూర్, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో, గణేష్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మరక్షణ సభ విశేష స్పందనతో విజయవంతమైంది.ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు మాట్లాడుతూ, సభను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సభకు శ్రీకారం చుట్టిన గణేష్ సేన, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి, వివిధ క్షేత్రాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులు, పోలీసు శాఖ, ప్రభుత్వ అధికారులు, శానిటేషన్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజుల్లో పార్టీలకు అతీతంగా ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో మెరుగుపడిన గాలి నాణ్యతలు



**న్యూఢిల్లీ జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: గడచిన 24 గంటల్లో ఢిల్లీలో వర్షం కురుసినందు వల్ల అక్కడి గాలి నాణ్యతలు మెరుగుపడ్డాయి. శనివారం ఉదయం 10 గంటలకు ఢిల్లీలో ఎక్యూఐ స్థాయిలు 242 వద్ద నమోదయ్యాయి. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఢిల్లీవాసులకి కాలుష్యం నుండి స్వల్ప ఉపశమనం లభించినట్లు పేర్కొంది. శుక్రవారం ఉదయం ఢిల్లీలో దట్టమైన పొంచు కురిసింది. శనివారానికి ఆ పరిస్థితులు లేవని సిపిసిబి వెల్లడించింది.

# మహేశ్వరం పట్టణంలో కాంగ్రెస్ నిరసన



**మహేశ్వరం, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పట్టణంలో ఉపాధి హామీ పథకం పేరు మార్పు, కేంద్ర నిధుల కోతపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతమయ్యాయి. "వీబీ జీరామ్ జీ వద్దు గాంధీజీ పేరే ముద్దు" అంటూ నినాదాలు మారుమోగాయి.కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజలను అహింస మార్గంలో నడిపించిన మహాత్మాగాంధీ పేరును తొలగించడం అనేది స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర అని మండిపడ్డారు. సమరయోధుల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియకుండా చేయాలని బీజేపీ, ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఫిబ్రవరి 25 వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసనలు, ఆందోళనలు కొనసాగుతాయని లక్ష్మారెడ్డి తెలిపారు. రేపు మహేశ్వరం పట్టణంలో జరిగే నిరసనలో కాంగ్రెస్ శ్రేణులు, ఉపాధి హామీ కూలీలు, అన్నదాతలు పాల్గొని ఎన్డీఏ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# 108 సిబ్బందికి ప్రశంసల వెల్లువ



**దేవరకొండ జనవరి 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలోని కే అఖిల అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా సంఘటన స్థలాన్ని చేరుకున్న 108 మెడికల్ టెక్నీషియన్ కొర్ర శంకర్ పైలెట్ ,బరపటి చంటి మహిళను ఇంటి వద్ద నుండి దేవరకొండకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఎర్రారం గ్రామ సమీపన పురిటి నొప్పులు ఎక్కువ అవ్వటంతో ఈఎంటి కొర్ర శంకర్ మహిళకు సాధారణ ప్రసవం చేశారు. పండింటి ఆడపిల్లను జన్మనివ్వడం జరిగింది 108 అత్యవసర డాక్టర్ శివ సూచన మేరకు తగిన మెడిసిన్ ఇచ్చి తల్లి బిడ్డలను దేవరకొండ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది పనితీరుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ జిల్లా ఈఎంఈ మధు, పీఎం సలీం మరియు హాస్పిటల్ లోని డాక్టర్లు అభినందించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వినోద్ రాథోడ్



**మహేశ్వరం, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని పడమటి తండా గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ వినోద్ రాథోడ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఉమ్మడి గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెద్దపులి నాగారం గ్రామపంచాయతీ ఆఫీస్‌కి వెళ్లి పింఛన్లు పొందాల్సి వచ్చేది. ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన వినోద్ రాథోడ్, శనివారం ఉదయం పోస్ట్‌మెన్ అనిల్ కుమార్ ద్వారా పడమటి తండా గ్రామపంచాయతీ ఆఫీస్‌లోనే పింఛన్లు అందజేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్థులు ఎదురుచూస్తున్న కోరిక నేడు నెరవేరిందని, ఇకపై వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తమ సొంత గ్రామంలోనే పింఛన్లు పొందగలరని తెలిపారు. గ్రామస్థులు, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమం గ్రామంలో ఆనందాన్ని నింపింది.

# చిన్నారుల కోరికలు తీర్చడమే లక్ష్యం



**మహేశ్వరం, జనవరి 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని పెద్దపులి నాగారం గ్రామంలో అంగన్వాడి కేంద్రం చిన్నారులకు కుర్చీలు, టేబుల్స్ అందజేయడం విశేషంగా నిలిచింది. గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారుల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు.5వ వార్డు సభ్యుడు షాహబుద్దీన్ ఖాన్ అంగన్వాడి కేంద్రంలో కుర్చీలు లేవని గ్రామ గ్రూపులో పోస్ట్ చేయగా, వెంటనే స్పందించిన సర్పంచ్ లింగం "నేటి బాలలే రేపటి పౌరులు" అంటూ తన సొంత డబ్బులతో కుర్చీలు, టేబుల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరూ ఇదే విధంగా మంచి ఆలోచనతో ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు నాగమణి, మాధవి, సూపర్వైజర్ శ్రీదేవి, చిన్నారులు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం అయ్యేలా చూస్తానని, చిన్నారుల అవసరాల విషయంలో ఎప్పుడైనా సంప్రదించాలని సర్పంచ్ లింగం స్పష్టం చేశారు.



## హాట్ ఫోజులతో.. హీటెక్కిస్తున్న హీటెక్కిస్తున్న


## చీరకట్టులో మనసులు దోచేస్తున్న రుక్మిణి..

సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో రుక్మిణి వసంత్ ఒకరు. ఒక్కసారిగా దక్షిణాదిలో విపరీతమైన పాపులరిటీ సొంతం చేసుకుంది. తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ.రక్షిత్ శెట్టి నటించిన సప్త సాగరాలు దాచే ఎల్లో సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో ఆమె పేరు ఇండస్ట్రీలో మారుమోగింది. తర్వాత అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైనా గుర్తింపు మాత్రం రాలేదు.ఇటీవల కన్నడలో రిషబ్ శెట్టి నటించిన కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకుంది. ఇందులో విలన్ గా కనిపించి మెప్పించింది. దీంతో ఆమె పేరు యావత్ భారతీయ సినీ పరిశ్రమలో మారుమోగింది.దీంతో ఈ బ్యూటీకి వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో రాబోతున్న డ్రాగన్ చిత్రంలో నటిస్తుంది. అలాగే తెలుగు, కన్నడ, తమిళంలో ఈ అమ్మడు మరిన్ని ఆఫర్స్ ఉన్నట్లు తెలుస్తోంది.అటు సినిమాలతోపాటు ఇటు సోషల్ మీడియాలోనూ సందడి చేస్తుంది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఆకుపచ్చ చీరలో అందంగా మెరిసిపోయింది.ఆకుపచ్చ పట్టు చీరలో మరింత అందంగా ముస్తాబైంది. తాజాగా షేర్ చేసిన ఫోటోలలో ఆమె అచ్చం కుందనపు బొమ్మలా కనిపిస్తుంది. అందులో చూడచక్కని వెన్నెలమ్మలా కనిపిస్తుందని కామెంట్స్ షేర్ చేస్తున్నారు.



## ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైన అనుపమ 'లాక్‌డౌన్'..

**-రిలీజ్ డేట్ ఫిక్స్!**




మలయాళ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ థ్రిల్లర్ 'లాక్‌డౌన్' ఎట్టకేలకు విడుదల తేదీని ప్రకటించింది. ఏఆర్ జీవా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం గతేడాదే విడుదల కావాల్సి ఉన్నా, తమిళనాడులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు మరియు కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమా కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'ప్రతి నిరీక్షణ వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది' అనే సందేశంతో ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు స్పష్టం చేసింది.ఈ చిత్రంలో అనుపమ 'అనిత' అనే మధ్యతరగతి యువతిగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనుంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో సామాన్యులు ఎదుర్కొన్న చేదు అనుభవాలు, ముఖ్యంగా ఒక యువతి ఒంటరిగా క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొంది అనే యదార్థ గాథ ఆధారంగా ఈ సినిమాను మలిచారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, నాయికా ప్రాధాన్యత ఉన్న ఈ చిత్రం అనుపమ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## అంతా మంచే జరిగింది!

తన సినీ కెరీర్‌లో గత ఏడాది ఎంతో ప్రత్యేకమని, విభిన్న భాషల్లో పనిచేయడం వల్ల ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ప్రస్తుతం ఈ భామ హిందీ 'కాక్‌టెయిల్-2'లో నటిస్తున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భిన్న భాషల్లో వైవిధ్యభరితమైన పాత్రల్లో కనిపించడంతో నటిగా మరింత పరిణితి చెందానని రష్మిక మందన్న చెప్పుకొచ్చింది.ఆమె మాట్లాడుతూ 'గత ఏడాది అన్నీ కలిసొచ్చాయి. సినిమాల పరంగా ఎందరో కొత్త వ్యక్తుల్ని కలుసుకోవడంతో పాటు వారి నుంచి ఫిల్మ్‌మేకింగ్‌కు సంబంధించిన గొప్ప విషయాల్ని నేర్చుకున్నా. ఎంత ఎదిగినా ఒదిగే ఉండాలని, మన మూలాల్ని మర్చిపోకూడదని అర్థం చేసుకున్నా. అన్నింటికంటే ముఖ్యంగా జయాపజయాలతో సంబంధం లేకుండా మనదైన వ్యక్తిత్వం, అంకితభావంతో ముందుకుసాగాలని నిర్ణయించుకున్నా' అని చెప్పింది రష్మిక మందన్న. 'కాక్‌టెయిల్-2' గురించి మాట్లాడుతూ.. ఈ సినిమాలో తన పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుందని, ఇప్పటివరకూ ఈ తరహా పాత్ర చేయలేదని తెలిపింది. ప్రస్తుతం ఆమె తెలుగులో 'మైసా', హిందీలో 'కాక్‌టెయిల్-2' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## దురంధర్‌ను మించిన బోర్డర్-2




దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.